క్లుప్తంగా

అంగన్‌వాడీ కిట్లు పంపిణీ



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న భాను, అంగన్‌వాడీ సిబ్బంది

పాలకొండ: పట్టణంలోని 9వ వార్డు పరిధిలో గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు స్థానిక పౌష్టికాహార కిట్లను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లా భాను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా



గాయపడిన కిరణ్, కూర్మినాయుడు

వీరఘట్టం: మండలంలోని యు.వెంకమ్మపేట జంక్షన్ వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు చందక కిరణ్, తట్టికాల కూర్మినాయుడుగా గుర్తించారు. ద్విచక్ర వాహనంపై రాజాం ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా..యు.వెంకమ్మపేట వద్ద టైర్ పంక్చర్ అవ్వడంతో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారిని 108 వాహనంలో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.


12న అంగన్‌వాడీ ఆయా పోస్టుకు ఇంటర్వ్యూ

వీరఘట్టం: స్థానిక బీసీ కాలనీలోని 6–సీ అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న హెల్పర్(ఆయా) పోస్టుకు ఈనెల 12న ఉదయం 8 గంటలకు సీతంపేట ఐటీడీఏలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు సీడీపీఓ యు.పూర్ణిమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు మొత్తం 9 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇంటర్వ్యూ కాల్ లెటర్లు స్థానిక కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, దరఖాస్తుదారులు మంగళవారం కార్యాలయానికి వచ్చి వాటిని తీసుకోవాలని కోరారు.

ప్రజలంతా ఆధార్ అప్‌డేట్ చేయించాలి

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నిత్యావసర సరుకులు పొందడానికి అవసరమైన ఆధార్ కార్డులను అందరూ అప్‌డేట్ చేయించుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు ఎం.బాబ్జీ అన్నారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సీడింగ్ కేంద్రాన్ని జెడ్పీటీసీ బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డులో సాంకేతికపరమైన కారణాలు తలెత్తడంతో కొంతమంది సంక్షేమ పథకాలు పొందడానికి అర్హత ఉన్నా పొందలేని పరిస్థితి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో సంక్షేమ పథకాలు మంజూరు చేయడంలో ప్రభుత్వంపై నిందలు వస్తున్నాయని తెలియజేశారు. ఇటీవల గ్రామాల్లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో జగరుతున్న గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆధార్ కార్డుల్లో తప్పులున్నాయి గుర్తించామన్నారు. ఆధార్‌కార్డులు ఉన్నవారంతా కార్డును అప్‌డేట్ చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొందవచ్చని తెలియజేశారు. ఇందుకోసం అంటిపేట, బూర్జ, సీతానగరం గ్రామాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె.శ్రీనివాసరావు, బి.ముకుందరావు పాల్గొన్నారు.

పశువ్యాధులపై పాడిరైతులకు అవగాహన



పాడిరైతులతో మాట్లాడుతున్న డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: శీతాకాలంలో పాడిపశువులు, దూడల్లో వచ్చే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఎ.డి సీహెచ్ దీనకుమార్ సూచించారు. పశువైద్య కేంద్రంలో సోమవారం పాడిపశువులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. దూడలను చల్లని ప్రదేశాల్లో ఉంచడం వల్ల న్యుమోనియా వ్యాధి బారిన పడతాయన్నారు. దీని నివారణకు దూడలను పశువుల సాలల్లో గాని లేదా ఇంటిగడపలో గోనె సంచులు వేసి అయినా ఉంచాలని సూచించారు. దూడలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని రైతులను కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పాలనే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



గుమ్మలక్ష్మీపురం: కిత్తలాంబలో సంక్షేమ పథకాల లబ్ధిని మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పాలన అందించడమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని గొయిపాక సచివాలయం పరిధి ఎస్టీ గొయిపాక, ఎస్సీ గొయిపాక, గండపాక, కిత్తలాంబ, గుల్లలంక, టంకు, రసాబడి గ్రామాలతో పాటు బీరుపాడు సచివాలయం పరిధిలోని వాడజంగి గ్రామంలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి గడపగడపకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరాతీశారు. మూడేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు చొప్పున కేటాయించిందన్నారు. ఆ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

ఘన స్వాగతం

'గడపగడపకు మన ప్రభుత్వం'లో భాగంగా గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి గిరిజనులు ఘన స్వాగతం పలికారు. స్వాతంత్య్రం వచ్చి 76 ఏళ్లు అయినా తమప్రాంతానికి సరైన రోడ్డు, రవాణా సౌకర్యం లేదని, కానీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి చొరవతో ప్రభుత్వం తమ గ్రామాలకు రోడ్లు నిర్మించడంతో పాటు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిందని సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు,గొయిపాక సర్పంచ్ కారంగి లక్ష్మి, ఎంపీటీసీ కొండగొర్రి కవిత, ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్లు సామల మాధవరావు, తోయక గోపాల్, పార్టీ నాయకులు కృష్ణమూర్తి, ఫిలి ఫ్, హర్షవర్ధన్, జయకుమార్, గురుమూర్తి పాల్గొన్నారు.

నేడు జర్నలో 'గడపగడపకు..'

గుమ్మలక్ష్మీపురం: మండలంలో జర్న గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ కుంబురుక దీనమయ్య తెలిపారు. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక అధికారులు హాజరుకావాలని కోరారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు



సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ రూరల్: సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని అట్టలి గ్రామంలో సర్పంచ్ కనుముల సంధ్యారాణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో నిండు మనసుతో స్థానిక ఎమ్మెల్యేతో పాటు ముఖ్యమంత్రికి అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు గ్రామంలో పలుచోట్ల రోడ్లు, కాలువల మరమ్మతులు చేయాలని కోరగా.. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్‌రావు, వాకముడి అనీల్ కుమార్, ఎంపీటీసీ కోట అజయ్‌కుమార్, వారాడ సరస్వతి, సర్పంచ్‌లు తిర్లంగి ఉపేంద్రకుమార్, వావిలపల్లి రాజారావు, లంక అప్పలనాయుడు, శివ్వాల శ్రీను, తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపీడీఓ తినాథ, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాయల సిబ్బంది పాల్గొన్నారు.

40 లీటర్ల సారా పట్టివేత

సీతంపేట: దీసరిగూడకు చెందిన సవర రాజు, గణేష్‌కు సారా తరలిస్తుండగా మండలంలోని వలగజ్జి జంక్షన్ వద్ద సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై నీలకంఠరావు తెలిపారు. వారి వద్ద 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఖైనీ,గుట్కాలు దహనం



ఖైనీ, గుట్కాలను కాల్చివేస్తున్న పోలీసులు

సాలూరు: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 12 కేసుల్లో పట్టుకున్న ఖైనీ, గుట్కాలను పోలీసులు సోమవారం దహనం చేశారు. డీఎస్పీ సుభాష్ ఆధ్వర్యంలో పట్టణ శివారులో సీజ్ చేసిన సరుకును సీజ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై పాపారావు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు పరిశీలన

పాచిపెంట/మక్కువ: పాచిపెంట మండలంలోని పి.కోనవలస సమీపంలోని ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల సరిహద్దులోని చెక్‌పోస్టును డీఎస్పీ ఎ.సుభాష్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. చెక్‌పోస్టు దాటుతున్న ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో సీఐ ధనుంజయరావు, సాలూరు రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నమ్మవారి ఘటాలతో తిరువీధి



అమ్మవారి ఘటాలతో తిరువీధి చేస్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామంలో చిన్నమ్మవారి పండగను పురస్కరించుకుని అమ్మవారి ఘటాలతో గ్రామ పురవీధుల్లో తిరువీధి నిర్వహించారు. సోమవారం ప్రారంభమైన అమ్మవారి జాతర బుధవారం ఉదయం అనుపోత్సవం వరకు జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఏటా సంక్రాంతి పండగకు ముందువారం నిర్వహించే అమ్మవారి పండగ సందర్భంగా రాత్రిపూట సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా ఘటాలను నెత్తిన పెట్టుకుంటారు.అమ్మవారి దీవెన కోసం మొక్కుకున్న వారంతా పండగకు హాజరై మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహక సభ్యులు సత్యారావు సూర్యారావు, రామారావు తెలియజేశారు.

మత్స్యకార సంఘాల బలోపేతమే లక్ష్యం

- జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి డబ్బీరు గోపీకృష్ణ



మాట్లాడుతున్న మత్స్యశాఖ అభివృద్ధి అధికారి గోపీకృష్ణ

కురుపాం: పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న మత్స్యకార సహకార సంఘాల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వం ముందున్న లక్ష్యమని జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి డబ్బీరు గోపీకృష్ణ అన్నారు. కురుపాం మండల కేంద్రంలోని సచివాలయంలో మత్స్యకార సహకార సంఘాల సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిష్ ఆంధ్రా పీఎంఎంఎస్‌వై (ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన)లో భాగంగా ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 60 శాతం సబ్సిడీపై, జనరల్ కేటగిరి వారికి 40 శాతం సబ్సిడీపై టూ వీలర్స్, త్రీ వీలర్స్, ఫోర్ వీలర్స్‌ను మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం మత్స్యకార వెబ్ పోర్టల్‌లో సంబంధిత సచివాలయంలో ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఫిషరీస్ వీఆర్‌ఏ ఇంద్రజ, సురేష్, మత్స్యకార సంఘాల అధ్యక్షులు చిన్నారావు, వెంకటరమణ, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు ముమ్మర ఏర్పాట్లు



విక్రమపురంలో జగనన్న కాలనీ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వీరఘట్టం: మండలంలోని జగనన్న కాలనీ లేఅవుట్లలో గత ఏడాది ఇళ్ల స్థలాలు కేటాయించిన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఎంపీడీఓ ఎ.ప్రభాకరరావు, హౌసింగ్ ఏఈ వి.వినోద్ విక్రమపురం, నడిమికెల్ల గ్రామాల్లో అభివృద్ధి చేసిన లేఅవుట్లను సోమవారం పరిశీలించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం కల్పించే రాయితీలు, సౌకర్యాలను వివరించారు. మండలంలో 795 ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టినట్లు ఏఈ తెలిపారు. లబ్ధిదారులే ఇళ్లు కట్టుకుంటామంటే ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తుందన్నారు. లేదంటే రాయితీపై ఇసుక, సిమెంట్, ఐరన్, ఇతర నిర్మాణ సామగ్రి, మేస్త్రీ కూలి, ప్లంబింగ్ ఎలక్ట్రికల్ మెటీరియల్ అందిస్తుందన్నారు. లబ్ధిదారులు ఈ రెండింటిలో ఏదో ఒక ఆప్షన్ ఎన్నుకుని, ఫిబ్రవరి మొదటి వారంలోగా నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు.

ప్రజాసంకల్ప యాత్ర చరిత్రాత్మకం

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



పాలకొండ: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, తదితరులు



వీరఘట్టం: వైఎస్సార్ విగ్రహం వద్ద జోహార్ వైఎస్సార్, జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాలకొండ: ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అనాడు చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందని ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. ప్రజాసంకల్పయాత్ర ముగిసి జనవరి 9 నాటికి నాలుగేళ్లు పూర్తయిన నేపథ్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంకల్పయాత్ర అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వ్యవసాయ సలహా మండలి మండల కమిటీ చైర్మన్ రణస్థలం రాంబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

- **వీరఘట్టం:** నేను విన్నాను..నేను ఉన్నాను అంటూ సాగిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర నాలుగు వసంతాలు పూర్తి చేసుకోవడంతో వీరఘట్టం మేజరు పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేడుకలు జరుపుకున్నారు. పార్టీ పట్టణ అధ్యక్షురాలు దిబ్బ లలితకుమారి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు 3,648 కిలోమీటర్లు చేపట్టిన పాదయాత్ర చరిత్ర పుటల్లో నిలిచిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బోగి మణి, బూరాడ చిన్న, పిన్నింటి శ్రీను, కోణార్క్ శ్రీను, పిన్నింటి దుర్గారావు, ఉగిరి శ్రీను, కెంగువ రంగ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల బారి నుంచి రక్షణ కల్పించాలి

- కలెక్టర్ నిషాంత్ కుమార్‌కు గిరిజన రైతుల వినతి



భామిని: కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న రైతులు



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ నవ్య

భామిని: ఏనుగులు పంటలను నాశనం చేస్తున్నాయని, వాటి బారి నుంచి పంటలను రక్షించాలని జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను ఘనసర పంచాయతీ సర్పంచ్ కిల్లారి కమల, రైతులు కోరారు. సోమవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత రెండేళ్లుగా పంట చేతికందివచ్చే సమయంలో ఏనుగులు పొలాల్లో చేరి పంటలను ధ్వంసం చేస్తున్నాయని వాపోయారు. ఏనుగుల కారణంగా తాము ఏటా నష్టపోతున్నామని, ప్రభుత్వం నుంచి పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. అలాగే ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వైఎస్సార్‌సీపీ కార్యదర్శి కిల్లారి ఫాల్గుణ, కోసలి సర్పంచ్ ఎం.మోహన్‌బాబు తదితరులు ఉన్నారు.

గిరిజన స్పందనకు 44 వినతులు

సీతంపేట: స్థానిక ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారి బి.నవ్య నిర్వహించిన గిరిజన స్పందనకు 44 వినతులు వచ్చాయి. సవర భాషా వలంటీర్‌లు తమను రెన్యువల్ చేయాలని కోరారు. కొండలోగాంలో రక్షణ గోడ నిర్మించాలని, జలంత్రకోటలో తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని పూతికవలసకు చెందిన సొంబురు, పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని గొట్టమంగళాపురం గ్రామస్తుడు రవి వినతిపత్రం కోరారు. టార్పాలిన్లు, కత్తెర్లు ఇప్పించాలని పులిగుమ్మికి చెందిన నర్సమ్మ, అంగన్‌వాడీ ఆయా పోస్టు కావాలని జగ్గడుగూడకు చెందిన జయమ్మ, కొత్త రేషన్‌కార్డు మంజూరు చేయాలని వలగజ్జిగూడకు చెందిన భారతమ్మ దరఖాస్తు చేసుకున్నారు.

సమన్వయంతో పనిచేసి అభివృద్ధి సాధించాలి

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: సమన్వయంతో పనిచేసి అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల సర్వసభ సమావేశం సోమవారం నిర్వహించారు. ఎంపీపీ బొమ్మాళి భాను అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ శాఖల వారిగా అందిస్తున్న సేవలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలుకు సంబంధించి వస్తున్న సమస్యలను, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులు గ్రామాల్లో పరిశీలన చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్సీ విక్రాంత్ కోరారు. సమావేశంలో ఎంపీడీఓ తినాథ, తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్‌రావు, వాకముడి అనీల్‌కుమార్, ఈఓపీఆర్డీ సత్యం, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని భార్యకు ఆర్థిక సాయం చేస్తున్న ఆటో యూనియన్ ప్రతినిధులు

కొమరాడ: ఇటీవల జాకురు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లువాడకు చెందిన ఆటోడ్రైవర్ హరి మృతి చెందాడు. దీనిపై స్పందించిన మండల కేంద్రంలోని శ్రీమజ్జి గౌరి ఆటో యూనియన్ సభ్యులు రూ.14వేలు సేకరించి మృతుని భార్య జయశ్రీకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకలు బచ్చల గోపి, సంతు మాట్లాడుతూ.. హరి కుటుంబానికి తమ వంతు సాయం చేశామని, వారి కుటుంబానికి యూనియన్ తరఫున అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు శ్రీను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారుల సంఖ్య పెరగాలి

- డ్వామా పీడీ రామచంద్రరావు



గరుగుబిల్లి: కొంకడివరంలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న పీడీ రామచంద్రరావు

గరుగుబిల్లి: ఉపాధిహామీ పథకం పనుల్లో పాల్గొంటున్న వేతనదారుల సంఖ్య తగ్గకుండా చూడాలని పార్వతీపురం మన్యం జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు అన్నారు. మండలంలోని కొంకడవరం పంచాయతీ పరిధి సీతారాంపురం గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పథకం పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులకు హాజరయ్యే వేతనదారులకు గిట్టుబాటు వేతనం అందేలా ఉపాధి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆ మేరకు కొలతలు ఇచ్చి పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. ఎన్.ఎం.ఎం.ఎస్ యాప్ ద్వారా వేతనదారుల మస్తర్లను నమోదు చేయాలన్నారు. వేతనదారులు రెండు పూటలా పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏపీఓ టి.రామకృష్ణనాయుడుకు సూచించారు. ఆయన వెంట జేఈ వై.రామదుర్గప్రసాద్, టీఏ ఎస్.పద్మ, ఎఫ్ఏ శ్రీనివాసరావు ఉన్నారు.

రెండుపూటలా ఉపాధి పనులు



మస్తర్లు తనిఖీ చేస్తున్న ఏపీఓ శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: ఉపాధిహామీ పనులను రెండు పూటలా చేయించాలని ఏపీఓ శ్రీనివాసరావు సూచించారు. ఇటిక గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. రెండు పూటలా పనులు చేయించాలని, ఆ ఫోటోలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలని మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. పనులకు రాని వారికి మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టెక్నికల్ అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట జేఈ తేజ ఉన్నారు.

తాగునీటి బోరు మరమ్మతులు



బోరు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని పిప్పలబద్ర గ్రామంలో పాడైన తాగునీటి బోరుకు సోమవారం మరమ్మతులు చేపట్టారు. సంక్రాంతి పండగ సమయంలో గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా బోరు బాగుచేయించినట్లు సర్పంచ్ వాన రాజమ్మ తెలిపారు. ప్రజలు చేతిపంపు బోర్లను జాగ్రత్తగా వాడుకోవాలని కోరారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

పాలకొండ రూరల్:

సంక్రాంతి వేడుకల్లో భాగంగా పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం నుంచి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. నెహ్రూ యువ కేంద్రం(శ్రీకాకుళం) వారి సౌజన్యంతో రెండు రోజులపాటు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కె.గోవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన క్రీడాకారులకు బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ పేరిట వాలీబాల్(పురుషులకు), కబ్బడీ (పురుషులు, మహిళలకు) పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు ధ్రువపత్రాలతోపాటు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులు 7396653284 నంబర్‌ను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.